


# దోబూచులాటల నడుమ ఉమ్మడి మెదక్ ఫలితాలు




## నరసాపూర్ లో విజేత ఎవరో?





**బీఆర్ఎస్ : వాకిటి సునీతా లక్ష్మారెడ్డి :** బీఆర్ఎస్ అభ్యర్థిగా నర్సాపూర్ నుంచి బరిలో దిగుతున్న మాజీ ఎమ్మెల్యే సునితారెడ్డికి రాజకీయంగా మంచి రికార్డు ఉంది. 1999, 2004, 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి హ్యాట్రిక్ విజయం సాధించారు. వైఎస్సార్, రోశయ్య, కిరణ్ కుమార్‌రెడ్డి క్యాబినెట్‌లో మంత్రిగా పని చేశారు. కానీ తెలంగాణ వచ్చాక జరిగిన రెండు ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ అభ్యర్థి చిలుముల మదన్‌రెడ్డి చేతిలో ఓడిపోయారు. ఈసారి సిట్టింగ్‌లకే అవకాశం ఇచ్చినా..నర్సాపూర్ నుంచి మాజీ ఎమ్మెల్యే, మంత్రి సునితారెడ్డికే అవకాశం కల్పించారు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గత రెండు ఎన్నికల్లో ఓటమిపాలైన సునీతా లక్ష్మారెడ్డి.. ఈసారి ఎలాగైనా గెలచి, అసెంబ్లీలో అడుగు పెట్టాలనే పట్టుదలతో ఉన్నారు. దీని కోసం అసంతృప్త నేతల మద్దతు కూడగట్టే పనిలోపడ్డారు సునితా లక్ష్మారెడ్డి. కే చంద్రశేఖర్‌రావు వరుసగా మూడోసారి ముఖ్యమంత్రి అయిన తర్వాత నియోజకవర్గంలోని అర్హులందరికీ గృహలక్ష్మి పథకం కింద ప్రభుత్వం సహాయం అందజేస్తుందని సునీత లక్ష్మారెడ్డి ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీలకు నిబద్ధత లేదని ఆరోపించిన ఆమె వ్యవసాయ రంగానికి నిరంతరాయంగా 24 గంటల కరెంట్ ఇస్తున్న ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని అన్నారు. చంద్రశేఖర్‌రావు నర్సాపూర్ నియోజకవర్గంలో అనేక చెక్‌డ్యామ్‌లు నిర్మించడంతో పాటు హల్దీ వాగులోకి గోదావరి నీటిని విడుదల చేసి వ్యవసాయ ముఖచిత్రాన్ని మార్చారు. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ (కెఎల్ఐఎస్) కింద మిగిలిన పనులు పూర్తయితే నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందుతుందని ప్రధానంగా ప్రచారం చేస్తూ ఓటర్లని ఆకర్షించే పనిలోఉన్నారు.

**బీజేపీ : ఎర్రగొల్ల మురళీ యాదవ్ :** ఉమ్మడి మెదక్ జిల్లా టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గా పనిచేసిన ఎర్రగొల్ల మురళీ యాదవ్ తనకు టిక్కెట్ వచ్చే ఆస్కారం లేకపోవటంతో బీఆర్ఎస్ లో వెనుకబడిన తరగతులకు చెందిన నాయకులకు సరైన ప్రాధాన్యత లేదంటూ పార్టీ అధినేతపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేసి పార్టీ నుంచి సస్పెండ్ కాబడి, కమలం పార్టీలో చేరి టిక్కెట్ అందుకున్నారు. మేనిఫెస్టో ప్రకటన తర్వాత తమ గ్రాఫ్ పెరిగిందని అగ్రనేతల సుడిగాలి పర్యటనలతో కార్యకర్తల్లో ఫుల్ జోష్ వచ్చిందని అంచనా దీనికి తోడు. బీసీ సీఎం ప్రకటన, ఎస్సీ వర్గీకరణకు అనుకూలం కారణంగా సైలెంట్ ఓటింగ్ ఉంటుందని బీజేపీ అభ్యర్థి ఎర్రగొల్ల మురళీ యాదవ్ చెపుతున్నారు. ప్రధానంగా జనసేన పార్టీతో పొత్తు మెగా అభిమానులు తనవెంట వచ్చి ఓటింగ్‌కు సహకరించి గెలుపును మరింతసునాయాసం చేస్తారన్న ధీమా కనిపిస్తోంది ఆయనలో.

**కాంగ్రెస్ ఆవుల రాజిరెడ్డి :** పార్టీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగుతునా న్నరు. ఇక్కడి నుంచి చాలా మంది ఆశావహులు పోటీపడినా అధిష్టానం మాత్రం రాజిరెడ్డికే అవకాశం కల్పించింది. వాస్తవానికి నర్సాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ చాలా బలంగా ఉండేది. కాంగ్రెస్ పార్టీకి ఒకప్పుడు కంచుకోట ఈ నియోజకవర్గం. ఇప్పటికీ పార్టీ కోసం కార్యకర్తలు కష్టపడి పని చేస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ గ్రాఫ్ పెరగడంతోపాటు ఈసారి అధికారంలోకి వస్తామనే ధీమా కూడా ఉంది. అయితే కొందరు అసమ్మతి నేతలు సర్దుకుపోతుండగా మరికొందరు మాత్రం.. హైకమాండ్ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వారందరినీ బుజ్జగించే పనిలోపడింది కాంగ్రెస్ పార్టీ నాయకత్వం. స్వార్థం కోసం పార్టీలు మారే లీడర్లను ఎట్టి పరిస్థితుల్లో నమ్మొద్దన్నారు. ఈ ఎన్నికలు పేదోడి జీవితం మార్చే ఎన్నికలని, పేదల బతుకులు కాంగ్రెస్ తో మారుతాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటే పేదల ప్రభుత్వం అని గతంలో అధికారంలో ఉన్నప్పుడు పేదలు కోసం ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకువచ్చి అమలు చేసిన ఘనత కాంగ్రెస్ కు ఉందన్నారు. లంబాడీల అభివృద్ధికి కాంగ్రెస్ అండగా ఉండి ఇచ్చిన హామీలు నెరవేరుస్తుందన్నారు.

## మెదక్‌లో హొరాహొరీ





మెదక్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థిగా సిటింగ్ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి మరోసారి బరిలో నిలబడ్డారు. ఆమెపై సీనియర్ నేత మైనంపల్లి హన్మంతరావు కుమారుడు మైనంపల్లి రోహిత్‌రావు కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఇక్కడ బీజేపీ అభ్యర్థిని బరిలోకి దింపినా ప్రధానమైన పోటీ పద్మ, రోహిత్‌ల మధ్యే దోబూచులాడుతోంది. అయితే ఈ ఎన్నికల్లో గెలుపు ఎవరిదయినా గానీ పద్మాదేవేందర్‌రెడ్డి మాత్రం ఓ అరుదైన రికార్డు సొంతం చేసుకున్నారు. ఒకే కుటుంబంలో తల్లి, తండ్రి, ఇప్పుడు కుమారుడి మీద కూడా పోటీ చేస్తున్నారు

**బీఆర్ఎస్ : పద్మా దేవేందర్ రెడ్డి :** బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని బీఆర్ఎస్ మెదక్ అభ్యర్థి, ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం ఏర్పాటు కాగానే సౌభాగ్య లక్ష్మి పథకం ద్వారా డాక్రా గ్రూపులో ఉన్న ప్రతి మహిళకు ప్రతి నెల రూ. 3 వేల జీవన భృతి అందిస్తామన్నారు. అసైన్డ్ భూములపై రైతులకు హక్కులు కల్పిస్తామన్నారు. రూ.16 వేల రైతుబంధు, రూ.400కే గ్యాస్ సిలిండర్, సన్న బియ్యం, ఐదు వేల పింఛన్ అందజేస్తామన్నారు. మెదక్ లో 500 పడకల హాస్పిటల్‌మంజూరైందన్నారు. పొద్దున్నుంచి రాత్రి వరకు మీ మధ్యలో ఉండే పద్మ గెలిస్తే.. మీ కోసం పని చేస్తుంది. రింగ్ రోడ్డు, ఇంజినీరింగ్ కాలేజీ ఆటోమేటిక్‌గా నడుచుకుంటూ వస్తయి. ఆ అవకాశం పోగొట్టుకుంటే చాలా ప్రమాదం అయితది. మళ్లీ తెలంగాణ ఇబ్బందుల పాలవుతది. సంపద పెంచుకుంటూ ప్రజలకు పంచుకుంటూ ముందుకు పోతుంది బీఆర్ఎస్ పార్టీ. అంటూ కేసీఆర్ ప్రచారం కలసి వస్తుందని భావిస్తున్నారు.

**బీజేపీ : పంజా విజయ్ కుమార్ :** ఈ ఎన్నికల్లో మొదటిసారిగా ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నారు పంజా విజయ్ కుమార్. అమెరికాలో సాఫ్ట్ వేర్ ఉద్యోగాన్ని వదిలేసి రాజకీయాల్లోకి వచ్చారు. 2019లో బీఆర్ఎస్ లో చేరి జడ్పీటీసీ సభ్యుడు అయ్యారు. తాజాగా ఆ పార్టీకి రాజీనామా చేసి బిజేపిలో చేరారు. హిందూ సంస్కృతి సంప్రదాయాలు అంటే ఇష్టమ్ ఉండటం. గ్రామాల్లో దేవాలయాల నిర్మాణం కోసం సాయం చేయడం. హిందూ ఎజెండాతోనే ప్రజల ముందుకు వెళ్లనున్నారు.

**కాంగ్రెస్ : మైనంపల్లి రోహిత్ :** మొదటిసారి మెదక్ శాసనసభ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. వైద్య వృత్తితో పాటు మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ అనే సంస్థను ఏర్పాటు చేసి వివిధ సామాజిక సేవ కార్యక్రమాలను నిర్వహి స్తున్నాడు. ఆయన కరోనా సమయంలో నిరుపేదలకు తన సంస్థ ద్వారా ఆర్థిక మరియు నిత్యావసరాలను అందజేశాడు. రాజకీయ అనుభవం లేకున్నా తనదైన శైలిలో ప్రచారంలో దూసుకుపోతున్నారు. మైనంపల్లి రోహిత్ రావుకు ఉన్న ఏకైకబలం తండ్రి హన్మంతరావే. హన్మంతరావుకు మెదక్ జిల్లాపై పట్టుంది. తెలుగుదేశం హయం లో ఆయన మెదక్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. మెదక్ జిల్లా రామయంపేట నుంచి 2సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఆర్థికంగా కూడా బలమైన నాయకుడు. కొడుక్కు టిక్కెట్ ఇవ్వలేదని కారు పార్టీపై కక్ష పెంచుకున్న మైనంపల్లి హన్మం తరావు.. మెదక్‌లో ఎలాగైనా గెలవాలన్న కసితో ఉన్నారు. చూడాలి మరి మెదక్ ప్రజలు ఎవరికి పట్టం కడుతారో.

## నారాయణ్‌ఖేడ్‌కి నాయకుడెవరు?





**బీఆర్ఎస్ : మహారెడ్డి భూపాల్ రెడ్డి :** భూపాల్ రెడ్డి మెదక్ జిల్లాలో తెలుగుదేశం పార్టీతో తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. తరువాత 2001లో టిఆర్ఎస్‌లో చేరారు మరియు తెలంగాణ కోసం ప్రత్యేక రాష్ట్ర ఆందోళనలో చురుకుగా పాల్గొన్నారు. కాంగ్రెస్ నమ్మితే కుక్క తోక పట్టుకొని గోదారి ఈదినట్టేనని.. కాంగ్రెస్ ఓ జూటాపార్టీ అంటూ తన ప్రచారం చేస్తున్నారు. పక్కనే ఉన్న కర్ణాటకలో కాంగ్రెస్ మాట మార్చిందని.. గెలిస్తే మహిళలకు ఉచిత బస్ అని చెప్పి.. బంద్ చేశారన్నారు. కరెంట్ చార్జీలు పెంచి ప్రజల నడ్డి విరిచారన్నారు. ఇక్కడ అమలు చేస్తున్న కేసీఆర్ కిట్, రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి వంటి పథకాలు లేవని.. ఇక్కడికి వచ్చి ఉద్ధరిస్తామంటున్నారంటూ విమర్శించారు. తండా తండాకు నీళ్లు తెచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌దని, గల్లీ గల్లీలో బారాన మందం రోడ్లు వేశామన్నారు. 70 సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో తాగేందుకు నీరు ఇవ్వలేదని, తాము తాగునీటితో పాటు సాగునీటిని సైతం అందిస్తామన్నారు. మరోమారు గెలిస్తే బసవేశ్వర ప్రాజెక్ట్ ద్వారా మీ ఇంటి ముందుకు నీళ్లు తెస్తామంటూ ప్రచారం చేస్తున్నారు.

**బీజేపీ : జెనవాడే సంగప్ప :** తెలంగణలో ఉద్యమకారులు గోస పడుతుంటే ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబం జల్సాలు చేస్తోందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి , బీజేపీ అభ్యర్థి జెనవాడే సంగప్ప ప్రచారం చేస్తున్నారు. తెలంగాణ ఏర్పడ్డాక అన్ని వర్గాలు ముఖ్యంగా యువత, రైతులు, దళితులు, మహిళలకు తీరని అన్యాయం జరిగిందని ఆయన అన్నారు. తొమ్మిదేళ్ల తెలంగాణలో నారాయణఖేడ్ కు తీరని అన్యాయం జరిగిందని సంగప్ప ఆరోపించారు. సిద్దిపేట, గజ్వేల్, సిరిసిల్ల నియోజకవర్గాలకు ఏటా వేల కోట్ల రూపాయల నిధులు వెచ్చిస్తుంటే, నారాయణఖేడ్ కి కనీసం అందులో పది శాతం కూడా కేటాయించలేదని సంగప్ప మండిపడ్డారు. నారాయణఖేడ్ లో ఎప్పటికీ ప్రతి ఏటా పల్లెలు ఖాళీ చేసి ప్రజలు వలస బాట పడుతున్నారని, ఇందుకోసమేనా తెలంగాణ తెచ్చుకున్నదని నిలదీశారు. బీజేపీ అధికారంలోకి రాగానే రాష్ట్రంలోని ఇల్లు లేని ప్రతి ఒక్క అర్హుడికి పక్కా ఇల్లు, పేదలందరికీ ఉచిత విద్య, వైద్యం అందిస్తామని సంగప్ప చెప్పారు.

**కాంగ్రెస్ : డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి :** కాంగ్రెస్ పార్టీ నారాయణ్‌ఖేడ్‌లో ముందుగా సురేష్‌కుమార్ షెట్కార్‌కు అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసి ఆపై అతడి స్థానంలో డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది . చివరి నిమిషంలో పోటీ నుంచి సురేష్ షెట్కర్ తప్పుకుని సంజీవరెడ్డికి మద్దతు పలికారు. నిరుద్యోగ రైతులు సింగూరు జలాల అవకతవకలలో ముందుండి పోరాటం తనకు కలసివస్తుందన్నదీమాలో ఉన్నారాయన. కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ రైతుబంధు పథకాలు కాంగ్రెస్ కార్యకర్తలకు ఇవ్వకుండా ఆపేశారని , ఆర్టికల్ 371 జే ప్రకారం స్థానికులకు ఉద్యోగ అవకాశాలపై పోరాడిన ఏకైక వ్యక్తి తానని , పలు పర్యాయాలు ఉద్యోగ మేళాలు నిర్వహించడం వల్ల యువత తనకు మద్దతుగా నిలుస్తుందన్న ధీమాలో ఉన్నారాయన. సబ్బండ వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేసిందని మునుముందు మరింత అభివృద్ధి చేసుకుందామన్నారు మహిళలకు 500 కే సబ్సిడీతో సిలిండర్ ఉచిత బస్సు ప్రయాణం లకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని తన గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేసారాయన.

## ఆందోల్‌లో గెలుపెవరది?





ఒకరు గత పరాజయానికి ప్రతీకారం తీర్చుకోవాలని సంకల్పం పూనితే.. మరొకరు మళ్లీ గెలిచి పైచేయి సాధించాలని పట్టువీడకుండా పోరాడుతున్నారు. వారే కాంగ్రెస్ నుంచి తొమ్మిదోసారి పోటీ చేస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి సిలారపు దామోదర రాజనర్సింహ, బీఆర్ఎస్ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్. అందోలు శాసనసభ నియోజకవర్గం ఈ ఇద్దరిలో ఎవరికి పట్టం కడుతుందో ఆసక్తిగా మారింది. తాను గెలిస్తే ముఖ్యమంత్రిని కావాలని భావిస్తున్న దామోదర... ఆయనను ఓడించి జైంట్ కిల్లర్‌గా పదవి పొందాలని చూస్తున్న క్రాంతికిరణ్ మధ్య హొరాహొరీ పోరు నెలకొన్నది. ఇక మాజీ మంత్రి, అందోలు మాజీ ఎమ్మెల్యే బాబూమోహన్ బీజేపీ నుంచి ఎన్నికల రంగంలో నిలిచి తాను ఉన్నానని గుర్తుచేస్తున్నారు. బీఎస్పీ అభ్యర్థిగా ముప్పారం ప్రకాశ్ తన ఉనికిని చాటుకునే ప్రయత్నం చేస్తున్నారు.

**బీఆర్ఎస్ : చంటి క్రాంతి కిరణ్ :** అందోలు నియోజకవర్గం ఎస్సీలకు రిజర్వ్ అయిన నాలుగున్నర దశాబ్దాల నాటి నుంచి నియోజకవర్గంలో స్థానికులకు పోటీ చేసే అవకాశం రాలేదని అనే ఆలోచన రేకెత్తించి గత ఎన్నికల్లో ప్రజల్లోకి వెళ్లి అదే కార్డుతో గెలిచిన జర్నలిస్టు నాయకుడు చంటి క్రాంతికిరణ్ మరోసారి బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో నిలిచారు. దామోదరను ఎలాగైనా ఓడించాలని బీఆర్ఎస్ భావిస్తోంది. గత ఎన్నికల్లో వర్కవుట్ అయిన స్థానికత అంశాన్నే ఈసారి కూడా ప్రచారాస్త్రంగా వాడుకుంటున్నది. బీఆర్ఎస్ అభ్యర్థి క్రాంతికిరణ్ గెలుపు బాధ్యతను ట్రబుల్ షూటర్, మంత్రి హరీశ్‌రావుకు అప్పగించింది. హరీశ్ మంత్రాంగం, క్రాంతికిరణ్ అండ్ కో యంత్రాంగంతో నియోజకవర్గంలో బీఆర్ఎస్ తమదైన శైలిలో రాజకీయం చేస్తోంది. నాలుగేళ్లుగా నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారు. ఇతర పార్టీల నుంచి ముఖ్యంగా కాంగ్రెస్ నుంచి వలసలను ప్రోత్సహించి ఆ పార్టీని కకావికలం చేయాలన్నది బీఆర్ఎస్ వ్యూహం. క్రాంతికిరణ్‌కు కేవలం నాలుగేళ్ల రాజకీయానుభవమే ఉన్నా, ప్రజలతో మమేకమై తిరుగుతూ ఓట్లు అడుగుతున్నారు.

**బీజేపీ : పల్లె బాబుమోహన్ :** మాజీ ఎమ్మెల్యే, బీజేపీ అభ్యర్థి బాబూమోహన్ ఎలాగైనా ప్రభావం చూపేందుకు కష్టపడుతున్నారు. అయితే బీజేపీ టికెట్ బాబూమోహన్‌కే మళ్లీ కేటాయించడంతో ఆయనను విభేదిస్తున్న పలువురు నేతలు దూరంగా ఉంటున్నారు. కొంతమంది ఇతర పార్టీల్లోకి వలస వెళుతున్నారు. ముఖ్యంగా బాబూమోహన్ తనయుడు ఉదయ్ బాబూమోహన్, ఉమ్మడి జిల్లా పరిషత్ మాజీ జడ్పీ చైర్మన్ మాసనగారి బాలయ్య బీజేపీని వీడి బీఆర్ఎసలో చేరడం పెద్దదెబ్బగా మారింది. ఉన్న క్యాడర్‌లోనూ కొందరు ప్రచారంలో పాల్గొనడం లేదు. బాబూమోహన్ ప్రచారంలోనూ అంతగా ఊపు కనిపించడం లేదు .కొద్దోగొప్పో ఉన్న బీజేపీ అభిమాన ఓట్లు, – అవినీతి ఆరోపణలు లేకపోవడం, – కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రచారం సాగిస్తుండటంతో ఏమాత్రం ప్రభావం చూపుతారో వేచిచూడాలి.

**కాంగ్రెస్ : దామోదర్ రాజనరసింహా :** కాంగ్రెస్ అభ్యర్థిగా ఆ పార్టీ రాష్ట్ర ఎన్నికల మేనేజ్‌మెంట్(నిర్వహణ) కమిటీ చైర్మన్, ఉమ్మడి రాష్ట్ర చివరి ఉప ముఖ్యమంత్రి, ఇటీవలి కాలంలో మల్లన్నసాగర్ అంశంతో ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీని ఇరుకున పెట్టిన దామోదర రాజనరసింహ పోటీలో ఉన్నారు. 34 ఏళ్ల రాజకీయంతో అందోలు రాజకీయాల్లో పాతుకుపోయిన దామోదర రాజనర్సింహ కూడా బీఆర్ఎస్ వ్యూహాలకు దీటుగా ప్రతివ్యూహాలను పన్నుతూ రాజకీయం నెరుపుతున్నారు. అధికార పార్టీ చేస్తోన్న ఆపరేషన్ ఆకర్ష్‌ను అదే అంశంతో కొడుతున్నారు. ఇందులో భాగంగా బీఆర్ఎసలో బలమైన నేతలను కాంగ్రెసలో చేర్చుకుంటున్నారు. దామోదర శైలి గతంతో పోలిస్తే భిన్నంగా ఉంది. గతంలో గ్రామంలో అందరినీ ఒక్కచోటకి పిలిచి, అక్కడే కూర్చుని మంతనాలు జరుపుతూ ఓట్లు అడిగేవారు. అయితే ఈసారి అందుకు భిన్నంగా, తానే ప్రజల వద్దకు వెళ్లడం విశేషం. ప్రతీ గ్రామంలోనూ ఇంటింటికీ వెళ్లడం ముఖ్యంగా మహిళలే లక్ష్యంగా వారితో కలిసి నేలపై కూర్చుని కాంగ్రెస్ పథకాలను వివరిస్తూ ఓట్లడుగుతున్నారు. తాను మంత్రిగా, ఉప ముఖ్యమంత్రిగా చేసిన అభివృద్ధి పనులను వివరిస్తూ మళ్ళీ గెలిపిస్తే మరింత అభివృద్ధి సాధిస్తానని ఓటర్లను ఆకట్టుకునే పనిలో పడ్డారు. ఓడినా, గెలిచినా 44 ఏళ్లుగా తన తండ్రి, తాను ఇదే నియోజకవర్గాన్ని అటిపెట్టుకుని ఉన్నాం తప్ప, అందోలును వీడలేదని తాను కూడా స్థానికుడినే అని చెబుతున్నారు.

## జహీరాబాద్‌లో పోరు జోరు





**బీఆర్ఎస్ : కొనింటి మాణిక్ రావు :** పేదల కోసమే బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే అభ్యర్థి మాణిక్ రావు ఎన్నికలలో ప్రచారం జోరుగా చేస్తున్నారు. కాంగ్రెస్ ఓటమి దాదాపు ఖాయమైందని, ప్రశాంత వాతావరణన్ని చెడగొట్టేందుకు కుట్రలు చేస్తున్నారని రైతుల ముసుగులో కుట్రలకు తెరలేపిన టూరిస్ట్ లేవరు కూడా 30 తేదీ తర్వాత ఇక్కడ కనిపించారన్నారు. పగటి వేషగాళ్ల మాటలు రైతులు నమ్మరాదన్నారు. బిఆర్ఎస్ అభివృద్ధి ఫలాలే తనని గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేసారాయన.

**బీజేపీ : రామచందర్ రాజనర్సింహ :** జహీరాబాద్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా రాజనర్సింహ రామచందర్ పేరు ఖరారు చేస్తూ జాబితాను ప్రకటించారు. జహీరాబాద్ కు పక్క నియోజకవర్గమైన ఆందోల్ నియోజకవర్గానికి చెందిన మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర్ రాజనర్సింహ సొంత తమ్ముడయినందున ప్రజాసేవపై పూర్తి రాజకీయ పరిజ్ఞానం కలిగి ఉన్నారు. కర్ణాటక మాజీ ముఖ్య కార్యదర్శి, బీజేపీ నాయకురాలు రత్నప్రభ కుటుంబంతో ఉన్న అనుబంధం వల్ల ఆయన బీజేపీ పార్టీలో చేరి జహీరాబాద్ ఎన్నికల బరిలో నిలిచారు. పీఎం.మోదీ చరస్మా , సంక్షేమ పథకాలు, బీఆర్ఎస్ బలహీనతలు, ప్రజల అండ దండలతో తాను విజయం సాధిస్తానని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

**కాంగ్రెస్ : డాక్టర్. ఎ. చంద్రశేఖర్ :** తెలంగాణ బీజేపీకి రాజీనామా చేసిన మాజీ మంత్రి డాక్టర్ ఏ.చంద్రశేఖర్ కాంగ్రెస్ పార్టీలో చేరి జహీరాబాద్ నుంచి కాంగ్రెస్ టికెట్ దక్కించుకున్నారు. రాష్ట్రంలో యువత మొత్తం కాంగ్రెస్ వైపు ఉన్నారని బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని నమ్మే స్థితిలో యువత లేరని మాజీ మంత్రి జహీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ ఏ చంద్రశేఖర్ అన్నారు బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులకు అన్యాయం చేస్తుందన్నారు. 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఒక్క ఉద్యోగం ఇవ్వలేదని వేసిన నోటిఫికేషన్లు రద్దు చేశారని మండి పడ్డారు. నవంబర్ 30న కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించేందుకు యువత సిద్దంగా ఉన్నారని ఆయన తెలిపారు.తనను ఆదరించి గెలిపిస్తే అందుబాటులో ఉండి నియోజకవర్గం అభివృద్ధి చేస్తానని హామీలతో ప్రచారం చేస్తున్నారు.

